# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పారిశ్రామికాభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "పీఎంశ్రీ" పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- ❖ రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో గనుల రంగంలో సమగ్ర సంస్కరణలను అమలు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.
- ❖ ఉత్తరాంధ్రలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================

పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన 18వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో వివిధ కంపెనీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. మొత్తంగా 50 కంపెనీలకు సంబంధించి 30,515 కోట్ల రూపాయల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా మొత్తంగా 29,677 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోందని, ఈ మేరకు స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం అందించాలన్నారు. రోబోటిక్స్ వంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులు విద్యా సంస్థల్లో ఉండాలే చర్యలు తీసుకోవలన్నారు. అలాగే ఇథనాల్... సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలని చెప్పారు. ఇథనాల్ తయారీ పరిశ్రమలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, ఇథనాల్ బేస్డ్ ఇంధనం ఎక్కువగా ఉపయోగిస్తే దిగుమతి చేసుకునే ఇంధన భారం తగ్గుతుందన్నారు.

==================

ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలు, పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్ది ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం గనుల రంగంలో సమగ్ర సంస్కరణలను అమలు చేస్తోందని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న గనుల రంగాన్ని పునరుద్ధరించి.. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు పారదర్శకతను నెలకొల్పామని పేర్కొన్నారు. సహజ వనరులు కొద్ది మంది స్వార్థ ప్రయోజనాలకు కాకుండా ప్రజా సంక్షేమానికి ఉపయోగపడాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

=================

ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో విద్యా శాఖ అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కడపలో మాదిరి ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించామని, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నాటికి పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి తెలియజేశారు. రాష్ట్రంలోని 430 కేజీబీవీ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,06,360 మంది విద్యార్థినులకు 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. కేజీబీవీలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో నిర్ణయించిన ఫీజులను స్కూల్ వెలుపల బోర్డులపై ప్రదర్శించడం తోపాటు పబ్లిక్ డొమైన్ లో పొందుపర్చాలని సూచించారు.

=================

పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక పథకాలను ప్రవేశపెట్టారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈరోజు పర్యటించిన ఆయన పోస్టల్ శాఖ ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల నమోదు స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చౌకగా, అతి తక్కువ ప్రీమియంతో జీవిత బీమా పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కేవలం 750 రూపాయలు చెల్లిస్తే.. 15 లక్షల రూపాయల ప్రమాద బీమా సదుపాయం ఉందన్నారు. పోస్టల్ శాఖ ద్వారా అత్యధిక వడ్డీ వచ్చే పలు పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో చేరేందుకు అన్ని నగరాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం అందరూ భాగస్వాములు కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

విరామం

=================

వ్యవసాయ శాస్త్రవేత్తల ఆవిష్కరణలను రైతులకు చేరువచేయటానికి అనేక చర్యలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, అధికారులతో ఆయన ఈరోజు సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... జిల్లా రైతులకు అవసరమయ్యే విత్తనాలను కనీసం యాభై శాతం ఈ విశ్వవిద్యాలయం నుండే ఇవ్వాలని కోరామని చెప్పారు. అలాగే డ్రోన్ల వాడకం, వ్యవసాయ యాంత్రీకరణపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నామని పెమ్మసాని చంద్రశేఖర్ వివరిస్తూ...

(బైట్ 27 సెకన్లు)

==================

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేకపోతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఈరోజు  సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం అవినీతి పాలన కొనసాగుతోందని, గత ప్రభుత్వం హయాంలో తాము సుపరిపాలన అందించామని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి 99 శాతం హామీలను అమలు చేశామన్నారు. వార్షిక క్యాలెండర్ పెట్టుకుని మరీ రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని చెప్పారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్ర వ్యాప్తంగా తన పాదయాత్ర ప్రారభమవుతుందని జగన్మోహన్ రెడ్డి వెల్లడించారు.

==================

రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పనకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని  వైఎస్సార్ కడప జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి ఎస్. సవిత అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కడపలో ఈరోజు నిర్వహించిన విజయోత్సవ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కడప జిల్లాను పునరుత్పాదక ఇంధన, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా భారీ సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు లక్షా 7 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు రానుండగా, వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. విద్య, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

==================

జార్ఖండ్ నుండి ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత వరకు విస్తరించి ఉన్న నిన్నటి అల్పపీడన ద్రోణి.. ప్రస్తుతం సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో తూర్పు విదర్భ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా తమిళనాడు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ద్రోణి ప్రభావంతో రేపు ఉత్తరాంధ్రతో పాటు, కాకినాడ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

==================
==================